ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 21.03.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. పేద ప్రజలకు వైద్యం భారం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.

2. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో కనీసం ఒక్క గ్యారంటీ కూడా అమలు కాలేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే. తారక రామారావు విమర్శించారు.

3. నెల రోజుల ఉపవాసాల తర్వాత నెలవంక దర్శనంతో ముస్లీం సోదరులు ఈదుల్ ఫితర్, రంజాన్ పర్వదినాన్ని రాష్ట్ర వ్యాప్తంగా భక్తి, శ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారు.

4. రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఈరోజు ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**బండి సంజయ్**

పేద ప్రజలకు వైద్యం భారం కాకూడదనే ఉద్దేశంతో నరేంద్రమోదీ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. అందులో భాగంగానే ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఈరోజు కరీంనగర్ లో

ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరలకే నాణ్యమైన జనరిక్ మందులు లభ్యమవుతాయని అన్నారు.

పిటిసి, కరీంనగర్

**పిఎం విజిట్**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏప్రిల్ రెండో వారంలో తెలంగాణలో పర్యటించనున్నారు. బీబీనగర్ ఎయిమ్స్ ప్రారంభోత్సవం సహ్ మరికొన్ని అభివృద్ధి పనులకు ఈ పర్యటనలో ప్రధానమంత్రి ప్రారంభోత్సవం చేస్తారు. జీహెచ్ఎంసీ ఎన్నికల నేపధ్యంలో సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్ లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడానికి బిజెపి రాష్ట్ర శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

డెస్క్

**ఆది శ్రీనివాస్**

రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రకటించిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తోందని, అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రత్యేక బీమా సదుపాయాన్ని ప్రవేశ పెట్టడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆది శ్రీనివాస్ తెలిపారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**కేటీఆర్**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో కనీసం ఒక్క గ్యారంటీ కూడా అమలు కాలేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే. తారక రామారావు విమర్శించారు. బడ్జెట్‌లో వీటికి సరిపడా నిధులు కేటాయించకుండా ప్రజలను మభ్యపెడుతోందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించడమే లక్ష్యంగా తాము శాసనసభలో,

శాసనమండలిలో వచ్చే శుక్రవారం ప్రైవేట్ బిల్లును ప్రవేశపెడతామని ప్రకటించారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్న అమలు చేయలేదని విమర్శించారు.

బైట్ ... కేటీఆర్

HYD-PTC

**రంజాన్**

నెల రోజుల ఉపవాసాల తర్వాత నెలవంక దర్శనంతో ముస్లీం సోదరులు ఈదుల్ ఫితర్, రంజాన్ పర్వదినాన్ని రాష్ట్ర వ్యాప్తంగా భక్తి, శ్రద్దలతో నిర్వహించుకుంటున్నారు. ఉప వాసాలు, దానదర్మాలు, ఆధ్యాత్మిక చింతన, కురాన్ అవతరణకు ప్రతీకగా నిర్వహించుకునే ఈ మాసం ఈదుల్ ఫితర్ తో పరిపూర్ణమవుతుంది. రంజాన్ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభకాంక్షలు తెలిపారు. పవిత్ర ఖురాన్ బోధనలు సమాజాన్ని సన్మార్గంలో నడుపుతూ కరుణ, మానవత్వాలకు మార్గదర్శంకగా నిలిచాయని గవర్నర్ తమ సందేశంలో పేర్కొన్నారు. మత సామరస్యానికి, లౌకిక వాదానికి రంజాన్ ప్రతీక అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కె. చంద్రశేఖర రావు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ మీర్ ఆలం ఈద్గా, మక్కా మసీద్, మాసబ్ ట్యాంక్ హాకీ గ్రౌండ్, సికింద్రాబాద్ బాలమ్ రాయ్ తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.

**డెస్క్**

**యూరియా**

దేశ వ్యాప్తంగా యూరియా ఉత్పత్తిని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎరువుల ప్లాంట్లకు అదనంగా ఎల్పీజీని సరఫరా చేయాలని నిర్ణయించింది. స్పాట్ మార్కెట్ నుంచి బిడ్డింగ్ ద్వారా అదనంగా రోజుకు 7.31 మిలియన్ మెట్రిక్ క్యూబిక్ మీటర్స్ వాయువును కొనుగోలు చేసేందుకు ప్లాంట్లకు అనుమతి ఇచ్చింది. అలాగే అమ్మోనియాను బహిరంగ

మార్కెట్ లో విక్రయించవద్దని, దానిని పూర్తిగా యూరియా తయారికే వినియోగించాలని ఆదేశాలు జారీ చేసింది.

డెస్క్

**రామచంద్రరావు**

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు జిహెచ్ఎంసి పరిధి లోని 9 జిల్లాల బీజేపీ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఈరోజు సమావేశం నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ లో త్వరలో జరిగే ఎన్నికలపై క్షేత్రస్థాయిలో సన్నద్ధత, సంస్థాగత సమన్వయం పార్టీ బలోపేతం, కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లే వ్యూహాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఇందులో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు కే లక్ష్మణ్, రఘునందన్ రావు పాల్గొన్నారు.

DESK

**కామారెడ్డి కలెక్టర్**

భారత సైన్యం ప్రకటించిన 'అగ్నివీర్-2027' రిక్రూట్‌మెంట్ ర్యాలీని కామారెడ్డి జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. ఇందులో భాగంగా అభ్యర్థుల వయో పరిమితిని 21 నుంచి 22 ఏళ్ళకు పెంచారని పేర్కొన్నారు. సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ పరిధిలోని కామారెడ్డి జిల్లాతో సహా తెలంగాణలోని 33 జిల్లాల అవివాహిత యువకులు దీనికి అర్హులని వెల్లడించారు. జూన్ 1 - 15 వరకు కామన్ ఎంట్రన్స్ పరీక్ష జరగనుందని సూచించారు.

పిటిసి, కామారెడ్డి

**HARISH RAO**

సిద్దిపేట పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు తమ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని, ఇప్పుడు ఆ ఫ్యాక్టరీని రేవంత్ రెడ్డి ప్రారంభించడం శోచనీయమని ఆయన విమర్శించారు. ఎంతో ముందు చూపుతో సిద్దిపేట జిల్లా, నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరికీ

తమ ప్రభుత్వం అన్ని వసతులు సమకూర్చామని ఆయన అన్నారు. అలాగే ఆయూష్ ఆసుపత్రులను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పాటు చేసిందన్నారు. మూడు పంటలకు రైతుబంధు ఇప్పటి వరకు ఇవ్వలేదని వెంటనే రైతుబంధు బకాయిలను చెల్లించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

DESK

**అడవుల పరిరక్షణ**

అడవుల పరిరక్షణతోనే మానవజాతి మనుగడ సాధ్యమని, భవిష్యత్తు తరాల కోసం అడవులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పన దేవి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రం శివారులోని అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అడవుల విధ్వంసం వల్ల వన్యప్రాణులు అంతరించిపోతున్నాయని, పర్యావరణ కాలుష్యం పెరుగుతోందన్నారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**సీపీ సజ్జనార్**

స్మార్ట్ ఫోన్ ద్వారా పరిచయమయ్యే అపరిచితుల పట్ల యువతులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. అందమైన ఫోటోలతో నకిలీ ఖాతాలు సృష్టించి, వ్యక్తిగత ఫోటోలతో బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ల తీరుపై అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఇటువంటి వేధింపులకు భయపడవద్దని, ధైర్యంగా డయల్ 100కు కాల్ చేసి వివరాలు తెలియజేయాలని కోరారు.

పిటిసి, హైదరాబాద్

**జీవన్ రెడ్డి**

పార్టీ మారబోతున్నానని సంకేతాలు ఇచ్చిన కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డితో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. ప్రస్తుతానికి తన నిర్ణయంలో ఎలాంటి

మార్పు లేదని, పూర్తి వివరాలను రేపు వెల్లడిస్తానని జీవన్ రెడ్డి వెల్లడించారు. జీవన్ రెడ్డి అభిప్రాయాలను, ఆయన ఆవేదనను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

డెస్క్

**నిరంజన్ రెడ్డి**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలను బడ్జెట్ పేరుతో వరుసగా మూడోసారి మోసం చేసిందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శించారు. ఈరోజు వనపర్తిలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం నిన్న ప్రవేశపెట్టిన మూడో బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను వంచించేలా ఉందన్నారు. సుమారు 3 లక్షల కోట్లు అప్పు చేసిన ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలు,11 డిక్లరేషన్ ల పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు.

పిటిసి, వనపర్తి

**వాతావరణం**

రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఈరోజు ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నాగర్ కర్నూల్ జిల్లాలకు ఆరంజ్ ఎలెర్ట్ జారీ చేసింది. గంటకు 40-60 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలియజేసింది.

డెస్క్

**పదవ తరగతి**

నిజామాబాద్ లో 10వ తరగతి పరీక్షల్లో జరిగిన సంఘటన నేపధ్యంలో పరీక్షా వ కేంద్రాల్లోకి ఇన్విజిలేటర్లు మొబైల్ ఫోన్ తీసుకువెళ్లడాన్ని పాఠశాల విద్యాశాఖ నిషేధించింది. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినా ఫోన్ ను గుర్తించేలా కొత్త ట్రాకింగ్ విధానం అమలులోకి తెచ్చింది.

డెస్క్